




### సోమశిలకు 23,182 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 23,182 క్యూసెక్కుల వరద వస్తుండగా, 68.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,350, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.











గ్రహణం ఇలా.. రాత్రి 10.35 గంటలకు.. 10.45 గంటలకు.. 10.55 గంటలకు.. 11 గంటలకు.. 11.10 గంటలకు..

# సంపూర్ణ చంద్రగ్రహణం

- జిల్లాలోని అన్నీ ఆలయాల మూత
- నేడు పునఃదర్శనం



తల్పగిరి రంగనాథస్వామి ఆలయ తలుపుల మూత

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భాద్రపదమాస పౌర్ణమి సందర్భంగా రాహుగ్రస్త చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9.57 గంటలకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున 1.23 వరకు కొనసాగింది. చంద్రగ్రహణ దృశ్యాలు జిల్లావాసులను కనువిందు చేశాయి. ఈ సందర్భంగా జిల్లాలోని అన్నీ ఆలయాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూసివేశారు. పెంచలకోన, నరసింహకొండ, కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కావలి కలుగోళశాంభవి, గొలగమూడి వెంకయ్యస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ, తల్పగిరి రంగనాథస్వామి, మూలస్థానేశ్వరస్వామి, ధర్మరాజులస్వామి, ఇరుకళల పరమేశ్వరి, అయ్యప్పగుడి, శ్రీరాజరాజేశ్వరి ఆలయాల తలుపులను అర్చకులు, దేవదాయశాఖ అధికారులతో కలిసి మూసివేశారు. గ్రహణం వీడాక ఆయా ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు పునఃదర్శన ఏర్పాట్లు చేశారు.



నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మూసి ఉన్న తలుపులు



బిట్రగుంట : ప్రసన్న వేంకటేశ్వరుడి..



నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయం..



రాపూరు : పెంచలోరి ఆలయం..

# సెకండ్ సమ్మర్...!

- వర్షాకాలంలోనూ ఎండల వేడి
- ఉష్ణోగ్రతలు 36 నుంచి 39 డిగ్రీల వరకు నమోదు

ఉదయగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా వర్షాకాలమైన సెప్టెంబరు ప్రారంభంలోనూ వేసవిని తలపిస్తోంది. వారం రోజులుగా జిల్లాలోని పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ఈనెలలో సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. రెండో వారంలోకి ప్రవేశిస్తున్నా ఎండాకాలంలో మాదిరిగా ఉదయం 9 గంటల నుంచే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం గంటల వరకు కూడా ఎండ తగ్గడంలేదు. ఇక మెట్ట ప్రాంతాల్లో చెప్పాల్సినవసరం లేదు. వర్షాకాలంలోనూ వరుణుడు ముఖం చాటేయడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ పరిస్థితులను చూసి జిల్లాలో సెకండ్ సమ్మర్ ప్రారంభమయిందని పలువురు అంటున్నారు.

**అలకబూనిన వరుణుడు**

ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ మెట్ట పంటలు సాగు చేశారు. ఆయా పంటలు కోత దశలో ఉన్నాయి.ఈ సమయంలో చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి కొన్ని రోజుల్లో రబీ సీజన్ ప్రారంభం కానుంది. రబీలో ప్రధానంగా వరి, శనగ, పొగాకు తదితర పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఆయా పంటల సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వరుణుడు అలకపూనడం, సూరీడు కాక పుట్టిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎరువులు భూమిలో కరగాలన్నా, తేమశాతం లేకపోవడంతో కొనుగోలు చేసిన వాటిని రైతులు తమ నివాసాల్లో నిల్వ చేశారు.



భానుడి దెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న ఉదయగిరిలోని గండిపాళెం రోడ్డు

# పేర్లు మార్చుదాం... బిల్లులు కొట్టేద్దాం.. !

- హౌసింగ్‌లో అక్రమార్కుల ఎత్తుగడ
- భారీగా అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్లు
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి..
- ఆ పేర్లతో బిల్లులకు బ్రేక్.. తెరపైకి కొత్త పేర్లు
- బినామీ పేర్లతో బిల్లులు తీసుకునే కుట్ర..!
- చక్రం తిప్పుతున్న హౌసింగ్ ఉన్నతాధికారి బంధువు

నెల్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో తవ్వేకొద్దీ అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటివరకూ బయటకు వచ్చిన కుంభకోణాలే కాదని, ఇంకా బయటకు రావాల్సినవి చాలా ఉన్నాయన్న చర్చ జరుగుతున్నది.ఈ తరుణంలోనే అక్రమార్కులు మళ్లీ బరితెగిస్తున్నారు. ఇప్పటి వరకూ ఒక పేరుపై పనులు చేశాం.. కాబట్టి ఇప్పుడు ఆ పేరును తీసేసి మరో పేరు పెట్టుకుంటే చేసిన పాపమంతా పోతుందన్న కుట్ర ఆలోచనకు తెరలేపారు. తెరలేపడమే కాదు.. ఆచరణలో కూడా పెట్టారు. జిల్లాలో ఇప్పటికే వందల ఇళ్ల ఒక కాంట్రాక్టర్ పేరు నుంచి మరో కాంట్రాక్టర్ పేరుపైకి మారిపోయినట్లు తెలుస్తోంది. చిన్న కాంట్రాక్టర్ల నుంచి పెద్ద కాంట్రాక్టర్ల వరకూ ఇదే పంథాను అనుసరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా కొత్త పేర్లను పెట్టి ఆ పేరు మీద బిల్లులు నొక్కేయాలన్న కుట్రలు పన్నుతున్నట్లు గృహ నిర్మాణశాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతి వ్యవహారాలకు బ్రేకులు వేయాల్సిన హౌసింగ్ అధికారులే అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తెరపైకి కొత్త పేర్లు**

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల మాటున భారీ దోపిడీ మొదలుపెట్టారు. ఆప్షన్-3 పేరుతో లబ్ధిదారుల అనుమతి లేకుండానే వారి ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించారు. కనీసం అగ్రిమెంటు కూడా లేకుండా రూ.కోట్ల విలువైన పనులు కట్టబెట్టారు. ఈ మాటున కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల పనులు చేయకుండా, మరికొన్ని చోట్ల తూతూమంత్రంగా పనులు చేసి పేదల సొమ్మును జేబుల్లో వేసుకున్నారు. ఈ హౌసింగ్ దోపిడీపై కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్ విచారణ జరిపింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.110 కోట్ల ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టినట్లు తేలింది. ఈ సొమ్ము మొత్తాన్ని కాంట్రాక్టర్ల వద్ద నుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ సూచించింది. ఇందుకు బాధ్యులుగా జిల్లాలో 365 మంది అధికారులను చేర్చడం గమనార్హం. అందులో గృహ నిర్మాణ శాఖకు చెందిన పీడీ నుంచి ఏఈ స్థాయి వరకూ ఉన్న అధికారులు 71 మంది ఉండగా, గ్రామ సచివాలయ సిబ్బంది 211 మంది, వార్డు సచివాలయ సిబ్బంది 83 మంది ఉన్నారు. విజిలెన్స్ రిపోర్టు ఇచ్చాక చాలామంది కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాల్సి ఉండడంతో అటువంటి వారికి కొత్తగా బిల్లులు చెల్లించడం ఆపేశారు. దీంతో ఇటువంటి వారందరికీ కొందరు -హౌసింగ్ అధికారులు విలువైన సలహా ఇచ్చినట్లు సమాచారం. ఈ కాంట్రాక్టర్లు తీసుకున్న ఇళ్లంటినీ మరొక కొత్త కాంట్రాక్టర్ పేరుపైకి మార్చి, ఆ పేరుపై పాత, కొత్త బిల్లులు తీసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగో అగ్రిమెంట్ కూడా లేదు కాబట్టి ఇలా ఇళ్లను మరొకరి పేరుపైకి మార్చేడం ద్వారా తప్పు చేసిన కాంట్రాక్టర్లపై అధికారికంగా భవిష్యత్‌లో చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉండదని అక్రమార్కులు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కావలి, ఆత్మకూరు ప్రాం తాల్లో 500 ఇళ్ల వరకూ ఇతరుల పేర్లపైకి మారినట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లను కూడా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు సమాచారం. హౌసింగ్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి సమీప బంధువు కావలిలో ఉండగా, ఆయన గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణాలు చేసి ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇప్పుడు ఆ వ్యక్తే అక్రమార్కులను తప్పించేందుకు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.




**ఎలాగైనా బిల్లులిప్పిద్దాం..!**

పేదల సొమ్మును దోచుకున్నట్లు విజిలెన్స్ విభాగం తేల్చిన తర్వాత కూడా అక్రమార్కులకు ఎలాగైనా బిల్లులు ఇప్పించాలని కొందరు హౌసింగ్ అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాల్సింది పోయి ఇటీవల కొందరు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే ఈ ప్రతిపాదనలు జిల్లా స్థాయిలో స్క్రూటినీ జరగలేదు. దీంతో వాటిని రాష్ట్ర కార్యాయల అధికారులు తిప్పి పంపారు. ఈ బిల్లులపై సంతకాలు పెట్టేందుకు కొందరు అధికారులు భయపడుతున్నారు. అయినా ఎలాగైనా బిల్లులు పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది.

# మళ్లీ కన్యాశుల్కం.. !

- వధువు వేటలో... వార్ధక్యం చేరువ..!
- బ్రహ్మచారులుగా మిగులుతున్న యువత
- తీవ్రమవుతోన్న పెళ్లికూతుళ్ల సమస్య
- మారుతున్న పరిస్థితుల్లో ఆలస్యంగా వివాహాలు
- ఇప్పటికే కొన్ని కులాల్లో తీవ్రమైన కొరత

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వధువు కావలెను... ప్రస్తుతం ఏ పత్రిక తిరగేసినా, ఏ వివాహ వేదిక(సైట్) చూసినా కుప్పలు తెప్పలుగా ఇలాంటి ప్రకటనలే కనిపిస్తున్నాయి. భ్రూణహత్యల నేపథ్యంలో భవిష్యత్ సంగతేమోగానీ, ఇప్పటికే పెళ్లికుమార్తెల సమస్య వేధిస్తోంది. వివిధ కులాల్లో పెళ్లీడుకి వచ్చిన యువతులకు కొరత రాగా, అమ్మాయిల కోసం పక్కరాష్ట్రాలను చుట్టి రావాల్సిన దుస్థితి నెలకొంది. ఈ తరుణంలో పలువురు యువకులు కట్నంలేకుండా పెళ్లిళ్లకు సిద్ధమవు తున్నారు. మరికొందరు కన్యాశుల్కంతో ముందుకొస్తున్నారు. మరికొందరు పిల్ల దొరక్క, పెళ్లికాక బ్రహ్మచారులుగా మిగిలిపో తున్నారు. దీన్ని బట్టి చూసే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**తగ్గుతున్న ఆడపిల్లల జనాభా**

భ్రూణహత్యలతో ఆడపిల్లల జనాభా నానాటికీ తగ్గుతోంది. ఫలితంగా రానున్న రోజుల్లో యువకులు పెళ్లాడేందుకు యువతులే లేకుండా పోవచ్చు.. కొంతకాలంగా పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తల పడుతున్న ఆందోళన ఇది. కానీ ఇది పాక్షికసత్యమే కావచ్చు. ఇప్పటికే చాలా కులాల్లో పెళ్లీడు యువతల కొరత తీవ్రమైంది. ఈడొచ్చిన కొడుకులకు పెళ్లిళ్లు చేయలేక తల్లిదండ్రులు కాలికి బలపం కట్టుకుని తిరగాల్సి వస్తున్నది. మ్యారేజీ బ్యూరోలను ఆశ్రయిస్తూ పక్కరాష్ట్రాలకు సైతం పరుగులు పెడుతున్నారు. భారతీయ వివాహ వ్యవస్థ ఎంతో పవిత్రమైంది. పటిష్ఠమైనది కూడా..... నాలుగైదు దశాబ్దాలు వెనక్కి వెళితే పెళ్లి కుదుర్చుకోవాలంటే కులం, గోత్రమే కాదు... ముందు ఏడు తరాలు, వెనక ఏడుతరాల చరిత్ర కూడా చూసేవారు. పెద్దలు చెప్పినదాన్ని బట్టి చూస్తే అప్పట్లో మగవాళ్ల కంటే ఆడపిల్లలే అధికంగా ఉండేవారు. కట్నకానుకలు సమర్పించి కన్యాదానం చేసేవారు. ఇటీవల వరకు ఇలాంటి పరిస్థితే ఉన్నా క్రమంగా మారుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ఆడపిల్లలపై కొనసాగుతున్న వివక్ష, పెంపకంలో పౌష్టికాహార లోపాలు, లింగనిర్ధారణ పరీక్షలతో భ్రూణహత్యలు పెరుగుతున్నాయి. పుట్టిన పాపలను సైతం హతమార్చడం లాంటి ఘటనలు వల్ల చాలా కులాల్లో ఆడపిల్లల సంఖ్య దారుణంగా పడిపోయింది. రెండు దశాబ్దాలుగా ఇది కొనసాగుతుండడంతో ప్రస్తుతం పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలు దొరకడంలేదు.

**కారణాలు ఎన్నో..**

గతంలో బాల్య వివాహాలు ఉండేవి. ఆ తరువాత వధువుకి 18, వరుడికి 21 ఏళ్ల నిండాకే వివాహం చేయాలన్న చట్టం వచ్చింది. ఇప్పుడు చదువు, ఉద్యోగ వేటలో పడి 25 నుంచి 30 ఏళ్లకుపైగా ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు. ముఖ్యంగా ఉన్నత విద్యావంతులు, వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తూ తమలాంటి కెరీర్ ఉన్నవారినే కోరుకుంటున్నారు. దీంతో వధువుల కొరత తీవ్రమైపోతోంది. ఈ నేపథ్యంలో కులాల పట్టింపులను కూడా పక్కన పెడుతున్నారు.

**పెళ్లికుమార్తెల కొరత**

ఓ అగ్రకులానికి చెందిన యువకుడి వయసు ప్రస్తుతం 35 ఏళ్లు. దాదాపు ఐదేళ్లుగా వధువు కోసం వెతుకుతున్నారు. కట్నం లేకపోయినా పర్వాలేదనుకున్నా పిల్ల మాత్రం దొరకడం లేదు. రెండు వైపులా పెళ్లిఖర్చులు తామే పెట్టుకుంటామనుకున్నా సంబంధాలు దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితి చాలా కులాలకు వచ్చేసింది.



తమకు అనుబంధంగా ఉన్న ఉపకులాల్లో పిల్ల అయినా పర్వాలేదనుకున్నా కూడా అమ్మాయి దొరకడం లేదు. కులం కట్టుబాట్లను గౌరవించే వాళ్లు ఎన్నాళ్లైనా సరే అదే కులం అమ్మాయిల కోసం నిరీక్షిస్తుంటే, కులాల పట్టింపు అంతగా లేని వారెందరో ఇతర కులాల అమ్మాయిలను వెతికి మరీ పెళ్లాడాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రధానంగా వధువులకు ఉన్న కొరతతోనే కులాల వారీగా వివాహ వేదికలు వెలుస్తున్నాయి. ఇందులో కొన్ని సేవా దృక్పథంతో పనిచేస్తుంటే, మరికొన్ని కమీషన్ బేస్డ్‌గా పనిచేస్తున్నాయి.



**ఇక కన్యాశుల్కమేనా ?**

ఈ పరిణామాలు భవిష్యత్‌లో కన్యాశుల్కానికి దారితీసే సూచన లేనని పలువురు పెద్దలు చెబుతుండడం గమనార్హం. పాత రోజుల్లో కన్యాశుల్కం చెల్లించి పెళ్లిళ్లు చేసుకునేవారు. ఆ తర్వాత కట్నం ఇచ్చే రోజులు వచ్చాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో తిరిగి కన్యాశుల్కం ఇచ్చే రోజులు త్వరలోనే వచ్చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

# రోడ్డున పడ్డ శనగ రైతు

- గిట్టుబాటు ధరలేక నానా అగచాట్లు
- గత ఏడాదిగా శీతల గిడ్డంగుల్లోనే పంట దిగుబడులు
- విత్తనం కొనుగోలు కంటే సగానికి దిగజారిన క్వింటాం ధర
- మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలి




కావలి రైతుబజారు ఎదుట శనగల బస్తా పెట్టుకుని అమ్ముకుంటున్న రైతు

కావలి రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వర్షాధారం ఆధారంగా పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డున పడ్డామని శనగ రైతులు వాపోతున్నారు. గత ఏడాది జిల్లాలో 8,666 ఎకరాల్లోనూ, కావలి మండలం చౌదరిపాలెం, జలదంకి మండలం గన్నారపుగుంట, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో సుమారు 500 ఎకరాలల్లో శనగ పంట ను రైతులు సాగుచేశారు. ప్రకాశం జిల్లా నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిరపడ్డ రైతులు నల్లరేగడి భూముల్లో వర్షాధారంతో పొగాకు, శనగ సాగుచేస్తున్నారు. ఎకరాకు కౌలు, దుక్కులు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలతో కలిపి రూ.40,000పైగా ఖర్చు పెట్టి రైతులు శనగ పండించారు. గత ఏడాది పంట వేసే సమయంలో శనగల ధర క్వింటాం రూ.12,000 ఉండగా, ప్రభుత్వం రైతులకు రాయితీపై క్వింటాం రూ.9,200లకు అందించింది.

**తగ్గిన దిగుబడి**

అధికవర్షాలతో వాతావరణం అనుకూలించకపోవటంతోపాటు పంట సాగులో వెనుకబడిక్కడంతో గత ఏడాది ఎకరాకు 4 నుంచి 5 క్వింటాల దిగుబడి మాత్రమే వచ్చింది. దిగుబడి తగ్గడంతోపాటు క్వింటాం ధర రూ.5,000 నుంచి 6,000 పలికింది. ఎకరాకు రూ.40,000 పెట్టుబడి పెడితే రూ. 25,000 నుంచి రూ. 30,000 వరకు మాత్రమే వచ్చాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసేటప్పుడు ఉన్న విత్తనధర కంటే పంట చేతికి వచ్చాక ఉన్న ధర సగం కూడా లేకపోవటంతో కొందరు రైతులు శనగలను ప్రకాశం జిల్లాలోని శీతల గిడ్డంగులకు తీసుకెళ్లారు. అక్కడ ఏడాదికి క్వింటాకు రూ. 150 చొప్పున చెల్లిస్తూ నిల్వ చేశారు. అయినా నేటివరకు మద్దతు ధర లేక పోగా, పంట దిగుబడి నిల్వల ఖర్చు మాత్రం పెరిగిపోయింది. దీంతో కొందరు రైతులు రైతుబజారు ఎదుట రోడ్లపై శనగ బస్తాలు పెట్టుకుని, వచ్చిన కాడికి తెగనమ్ముకుంటున్నారు. మరికొందరు మోటారు సైకిళ్లపై బస్తా పెట్టుకుని వెళ్లి గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. వారి పరిస్థితి చూస్తుంటే కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.. ఇప్పటికైనా మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**గిట్టుబాటు ధర లేక రూ. లక్షల్లో నష్టపోయా**



భూమి కౌలుకు తీసుకుని 35 ఎకరాల్లో శనగ పంట సాగుచేసి రూ.12 లక్షల మేర నష్టపోయా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవటంతో ప్రకాశం జిల్లా ఒంగోలు వద్ద ఉన్న కోల్డ్ స్టోరేజీలో 300 క్వింటాలు నిల్వ చేశా. రెండేళ్ల నుంచి సరుకు అక్కడే మగ్గిపోతున్నది.

- బత్తుల రవిప్రసాద్, చౌదరిపాలెం కౌలు రైతు

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 120 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 242 |
| కోడిగుడ్ల ధర (100): 545 | |

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.10243 |
| వెండి కిలో ధర | రూ. 127700 |
| వెండి ఒక గ్రాము | రూ.130.70 |

## వేదగిరి క్షేత్రం మూత

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణ నేపథ్యంలో వేదగిరి క్షేత్రాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం గరుడ వాహనంపై లక్ష్మీనరసింహ స్వామిని ఊరేగించారు. సాయంత్రం నిర్వహించాల్సిన గిరిప్రదక్షణను ముందుగానే జరిపారు. సోమవారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసి పుణ్యాహవాచనం, మహానివేదన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాష్యరాచార్యులు తెలిపారు.



## వైభవంగా సాయి భక్తుల గొలగమూడి యాత్ర

బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ (అద్దాల మందిరం) ఆధ్వర్యంలో సాయి మాలధారణ భక్తులు ఆదివారం గొలగమూడి వెంకయ్యస్వామి సన్నిధికి చేసిన పాదయాత్ర వైభవంగా సాగింది. ఉదయం 6 గంటలకు సాయిదర్బార్ నుంచి 300 మంది సాయి నామ సంకీర్తన, ఓంనారాయణ ఆదినారాయణ నామ సంకీర్తన, పండరి భజన, కోలాటాలతో గొలగమూడి చేరారు. అనంతరం వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాలను మందిరం చైర్మన్ మధుసాయి, పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం), ఆంధ్రజ్యోతి)



సంతపేట సెంటర్‌లో రోడ్డుపై ఉన్న పాత గోడలపై పెరిగిన చెట్టు





పాత జడ్పీ కార్యాలయం భవనం వెనకాల గోడపై విస్తరిస్తున్న వృక్షాలు

# గోడల్లో మాన్లు!

**మోగుతున్న ప్రమాద ఘంటికలు**

నగరంలోని పలు ప్రాంతాల్లో పాత భవనాల గోడలు ఏ క్షణంలోనైనా కూలిపడే పరిస్థితిలో ఉన్నాయి. ఈ గోడలలో పెరిగిన మర్రి, రావి మొక్కలు మాన్లుగా మారి రోడ్లపైకి విస్తరించాయి. వర్షాకాలం ఈ చెట్లతోపాటు, గోడలు కూలి పాదచారులు, వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు ముందుగానే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## రూ.16వేల కోట్ల వ్యాపారాన్ని అధిగమిస్తాం

● బీవోఐ జోనల్ మేనేజర్ బంగార్రాజు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ 2026 మార్చి ఆఖరుకు రూ.16వేల కోట్ల వ్యాపారాన్ని అధిగమించటమే లక్ష్యంగా పని చేస్తోందని ఆ బ్యాంకు జోన్ జోనల్ మేనేజర్ బంగార్రాజు చెప్పారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ వార్షికోత్సవాన్ని నెల్లూరు మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ సందీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జోనల్ మేనేజర్ భారీ కేక్ కట్ చేశారు. తమ బ్యాంకు విజయవాడ జోన్ రూ.15వేల కోట్ల వ్యాపారం చేస్తోందని చెప్పారు. తక్కువ వడ్డీతో ఖాతాదారులకు రుణాలు అందచేస్తున్నామని, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ మొహంతి, బీవోఐ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి నగేష్, అబ్దుల్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చిన్నారులతో జెడ్‌ఎం బంగార్రాజు తదితరులు

## దివ్యాంగ ఉపాధ్యాయులకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక టీవీఎస్ కల్యాణ సదన్‌లో దివ్యాంగ ఉపాధ్యాయుల సన్మాన సభ జరిగింది. సమదృష్టి సమతా వికాసం, అనుసంధాన మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న దివ్యాంగ ఉపాధ్యాయులకు సత్కరించారు. వీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ కే అశోక్‌రావు మాట్లాడుతూ సమదృష్టి సమతా వికాసం కోసం మండలి పని చేస్తోందని చెప్పారు. వీఎస్ యూనివర్సిటీ ఆచార్యుడు డాక్టర్ బీఎస్ భగవాన్ మాట్లాడుతూ మనం పైథాగరస్ సిద్ధాంతం పేరుతో గణిత శాస్త్రం చదువుకుంటున్నామని, కానీ రెండో శతాబ్దం నుంచి బోధాయన మహర్షి నిర్వచించిన సిద్ధాంతాన్ని మనం మరిచామని చెప్పారు. ఉపాధ్యాయులందరూ భారతీయ సిద్ధాంతాలను గుర్తించి రాబోయే తరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సేవా ప్రముఖ్ బీ మల్లికార్జున్‌రెడ్డి, అనుసంధాన మండలి నాయకులు చెంచురామయ్య, జ్యోతిర్మయి, చక్రపాణి, ఏ హరిబాబు, జే సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న దివ్యాంగ ఉపాధ్యాయులు

## అమ్మ ఆసుపత్రి ప్రారంభం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురంలో అమ్మ ఆసుపత్రి, ఐవీఎఫ్ సెంటర్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వక్ఫ్‌బో ర్డు రాష్ట్ర చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్, ఇన్‌ఫెర్టిలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ల్యాప్రోస్కోపిక్ చికిత్సలు, పిల్లలు లేని వారి కోసం ఐయూఐ, ఐవీఎఫ్ వంటి చికిత్సలు అందిస్తామని తెలిపారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కేదార్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లల వ్యాధులకు సంబంధించి అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నా మని తెలియచేశారు. ప్రత్యేక డైట్‌తోపాటు యోగా కౌన్సెలింగ్, ఎన్ఐసీయూ వంటి సేవలు కూడా అందిస్తున్నామని వివరించారు.



జ్యోతి వెలిగించి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చిత్రంలో ఎమ్మెల్సీ బీద, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

## రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్రం ఉచిత వైద్య చికిత్సలు

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర రెడ్డి



నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణం(గోల్డన్ అవర్)లో వెంటనే శస్త్ర చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ.1.50 లక్షలు విడుదల చేస్తుందని తెలుగు దేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏటా 6.80 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, 3.72 లక్షల మంది మరణిస్తున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందక అనేక మంది మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం ప్రమాద బాధితులకు నగదు రహితంగా వైద్య చికిత్సలు అందించేందుకు తాజాగా ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రమాదం జరిగిన ఏడు రోజుల దాకా ఉచిత వైద్యం అందుతుందని తెలియచేశారు. బాధితులు డిశ్చార్జ్ అయిన తర్వాత వైద్య బిల్లులను పోర్టల్‌లో అప్లోడ్ చేస్తే నేషనల్ హెల్త్ అథారిటీ రీయింబర్స్ చేస్తుందని వెల్లడించారు.

## కాలువలు శుభ్రం చేయించండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 27వ డివిజన్ సావిత్రినగర్ మొదటి వీధిలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉందని భారతసేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో కాలువలు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల కొరతతో పారిశుధ్య పనులు నెమ్మదించి దోమలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ క్రమంలో కార్మిక ఖాళీలు భర్తీ చేయాలని కమిషనర్ నందన్‌ను కోరారు.

## 13న జేఏసీ ప్రథమ జోనల్ సమావేశం

● ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13న విజయనగరంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ ప్రథమ జోనల్ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను విజయవాడలో ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర జేఏసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక అంశాల సాధనకు కృషి చేస్తామన్నారు. ప్రొబేషన్ కాలం ఆలస్యం కావడంతో ఉద్యోగులు కోల్పోయిన తొమ్మిది నెలల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండేళ్ల ప్రొబేషన్ కాలంలో మంజూరు చేయాల్సిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రతిశాఖ ఉద్యోగికి నిర్దిష్టమైన సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. అక్టోబరు 7 నాటికి ఒకే కేడర్‌లో పనిచేస్తూ ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకుని ప్రమోషన్ లేకుండా ఉన్న ప్రతి ఒక్క గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ కింద ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ పిల్లి హరీష్, కన్వీనర్ పులిబండ్ల నరసింహారావు, కో-చైర్మన్ వేంకటేశ్వరరావు, మహేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చూసేదెవరు... 'తనిఖీ' చేసేదెవరు?

● హోటళ్లలో విషాహారం

● ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ?



పొదలకూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : 'ఏ హోటల్లో చూసినా ఏమున్నది గర్వ కారణం. ఆహార పదార్థాలు సర్వం విషతుల్యం!' అవును.. మండలంలోని పలు హోటళ్లలో ఇదే దుస్థితి నెలకొంది. ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ సంస్థ అధికారులు తరచూ తనిఖీలు చేయకపోవడమే హోటళ్ల యాజమాన్యాలకు వరంగా మారింది. అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారులు సక్రమంగా తనిఖీలు చేయకపోవడంతో చిన్న, పెద్ద హోటళ్లలో నియమ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. ఇటీవల జిల్లాలో పలు హోటళ్లు, జ్యూస్ షాపుల్లో జరిగిన అధికారుల తనిఖీల్లో కుళ్లిన మాంసాల నిల్వలు, పాడైపోయిన ఆహార పదార్థాలు కొన్ని వెలుగులోకి వచ్చిన సంఘటనలు ఉన్నాయి. 60 శాతానికి పైగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల రోజుల తరబడి నిల్వ చేసిన మాంసం, నాసిరకం వంటనూనె, పాడైపోయిన కూరగాయలు, పురుగుపట్టిన ప ప్పు దినుసులు, మోతాదుకు మించి రంగు కలి పిన ఆహార పదార్థాలు వంటి విషయాల్లో అధికారులు కఠినంగా ఉండాల్సి ఉంది.

● గతంలో తనిఖీలు ఇలా..

నగరం, మున్సిపాలిటీల పరిధిలో గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హోటళ్లలో తనిఖీలు జరిపేవారు. ఆహార పదార్థాల శాంపిళ్లను ప్రయోగాలకు పంపేవారు. వారికి సాంకేతికంగా శిక్షణ లేదని, ఇలాంటి అధికారం తొలగించాలని ఆహార భద్రత శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించడంతో.. ప్రభుత్వం ఈ అధికారాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించింది.

● సిబ్బంది కొరత వల్లేనా?

సిబ్బందిని పెంచకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. సిబ్బంది పెంచలేని పరిస్థితి ఉంటే.. మున్సి పాలిటీ, నగర పాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ ఇచ్చి సిబ్బందిని నియమిస్తే ఆహార భద్రత పర్యవేక్షణ మెరుగువుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మిగిలి పోయిన వాటిని వేడిచేసి వడ్డించడంపై కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల్లో చలనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## జొన్నవాడ ఆలయం మూసివేత

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా జొన్నవాడ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం తలుపులు తెరుస్తామని ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.



తాళం వేస్తున్న అర్చకులు

## 'సాయంబడి' ట్యూషన్ టీచర్లకు శిక్షణ

ఇందుకూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సింహపురి వైద్య సేవా సమితి ట్రస్ట్, జయభారతి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రం 'సాయంబడి' ట్యూషన్ టీచర్లకు శిక్షణ, వార్షిక యోజన కార్యక్రమం ఆదివారం ముగిసింది. చిన్మయమిషన్ ఆచార్యులు స్వామి సర్వేశానంద బ్రహ్మచారి హరీష్ చైతన్య, గాంధీ ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ఇందుకూరుపేట బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి, జయభారత్ హాస్పిటల్ మేనేజర్ గురుప్రసాద్, సాయం బడుల శిక్షణ కార్యక్రమం నిర్వాహకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పరిమళించిన మానవత్వం..

### అవ్వకు యువకుల ఆసరా

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దారి పక్కన.. మండుటెండలో జొన్నవాడ ఓవర్‌ట్యాంక్ సమీపంలో ఓ వృద్ధురాలు పడిపోయింది. కూడు లేక.. నీళ్ల లేక... నడిచేందుకు శక్తి లేక.. స్పృహ కోల్పోయింది. ఇంతలో ఓ మహిళ... కొందరు యువకులు కలిసి అవ్వను చెట్టు నీడకు చేర్చారు.. ముఖంపై నీళ్ల చల్లారు. సపర్యలు చేసి ఆసరాగా నిలిచారు! ప్రాణాపాయం తప్పినా.. అవ్వ మాత్రం స్పృహలోకి రాలేదు.



అవ్వను నీడకు చేరుస్తున్న యువకులు



## ప్రశాంతంగా ముగిసిన చవితి ఉత్సవాలు

మనుబోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లో లంబోదరుడి లడ్డు రూ. 51 వేలు పలికింది. చవితి నుంచి 11 రోజుల పాటు రెండుచోట్ల గణేష్ మండపాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. శనివారం అర్ధ రాత్రి భారీ గణనాథులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాలు నిర్వహించారు. రాజావీధి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద లంబోదరుడి లడ్డు వేలం పాట నిర్వహించగా రూ. 51 వేలకు తుమ్మతాటి లాస్యశ్రీ దక్కించుకుంది. అలాగే డబ్బుల మాలను రూ. 20 వేలకు బల్లి చరణ్, కాయిన్‌ను రూ.13 వేలకు అరవ శ్రీనివాసులు దక్కించుకున్నారు. దిబ్బ వద్ద ఏర్పాటు చేసిన మరో వినాయకుడి మండపం వద్ద లడ్డును రూ. 41 వేలకు పరిమళ సురేష్ దక్కించుకోగా, డబ్బుల మాలను వల్లూరు అవినాష్ రూ. 26 వేలకు, కాయిన్‌ను రూ. 11 వేలకు గోళ్ల సతీష్‌లు దక్కించుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామోత్సవాల అనంతరం ఆదివారం వేకువజామున కండలేరు వాగులో బొజ్జ గణ పయ్యలను నిమజ్జనం చేశారు.

**ముత్తుకూరు :** ముత్తుకూరు మండలంలో ప్రతి ఏటా ప్రత్యేకత చాటుకునే జంగాల కండ్రిగ గణనాథుని నిమజ్జనోత్సవం ఆదివారం జరిగింది. విశేష పూలాలంకరణతో గణనాథుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బాణసంచా వెలుగులు, మంగళవాద్యాల మధ్య ఊరే గింపు సాగింది. చిన్నారులు, యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గణనాథుని విగ్రహాన్ని ట్రాక్టర్లపై అలంకరించి బ్రహ్మదేవి, ముత్తుకూరు మీదుగా తీసుకెళ్లి కృష్ణపట్నం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో తీరం మారుమోగింది. గణనాథుని చూసేందుకు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని రేబాల గ్రామంలో నెలకొల్పిన గణేష్ విగ్రహం గ్రామోత్సవం, నిమజ్జనోత్సవం ఆదివారం వేకువజామున అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వాద్యాలు భక్తులను అలరించాయి. ఆదివారం వేకువజామున గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువత ఉత్సాహంతో నృత్యాలు చేశారు.



కండలేరు వాగులో గణేశుడి నిమజ్జనంలో యువత

### 'బెజవాడ'కు శుభాకాంక్షలు తెలిపిన జనతా ఫౌండేషన్ సభ్యులు

విడవలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డిని ఆదివారం జనతా ఫౌండేషన్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది దాసరి ప్రసాద్ నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనతా ఫౌండేషన్ సభ్యులు పులి మనోజ్‌కుమార్, మురళీధర్, సుమన్, వెంకటేష్, అంకయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ వలి దర్గాను సందర్శించారు. పలువురు భక్తులు షాఫాబావిలో పుణ్య స్నానాలు ఆచరించి మస్తాన్ స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు.

## వడ్డెర్ల సంక్షేమానికి కృషి చేస్తా!

**ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి మునిస్వామి**

వెంకటాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వడ్డెర కులస్తుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి మునిస్వామి పేర్కొన్నారు. వెంకటాచలం పంచాయతీ వడ్డీపాళెంలోని నివాసంలో ఆదివారం సాయంత్రం వడ్డెర సంఘం నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఏపీలో దాదాపు 30 లక్షల మంది వడ్డెర కులస్తులు ఉన్నారని, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వడ్డెర్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మునుస్వామి తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వడ్డెర్ల అభ్యున్నతికి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూరుశాతం అందేలా తనవంతుగా ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నేతలు ఉప్పు దేవసేన బాబు, అనుదీప్ కుమార్, వెంకటాద్రి, రాజా, వల్లెపు వెంకటేశ్వర్లు, మల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ఇందుకూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. టీడీపీ మండల కన్వీనర్ పవన్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కంచర్ల శేషగిరిరావు, సభ్యులుగా పాటూరు సుదర్శన, సింగమల సతీష్, ఇరువులు రమణయ్య, చిరువెళ్ల సునీత, యనమల జయంతి, పముజుల, ఎక్స్‌అఫిషియో కాటూరి రమ, వీవీ శేషాచార్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి మోహన్‌రావు, స్థానిక టీడీపీ నాయకులు పేట మురళి తదితరులు పాల్గొన్నారు.



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

పెంచలకోనలో గత నాలుగు రోజులుగా నృసింహునికి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం చతుస్థానార్చన వేద, దివ్య ప్రబంధ పారాయణ, విశేష హోమాలు, శేష వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీవార్లకు స్నపన తిరుమంజనం, మహా పూర్ణాహుతి, నివేదన, శాత్తుముర్రై తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



పవిత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

### రంగడి ఆలయంలో మహా కుంభ ప్రోక్షణ

## వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం నిత్య హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి, తిరుమంజన సేవ జరిగాయి. వీటితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈనెల 1వతేదీ నుంచి జరుగుతున్న ఈ ఉత్సవాలలో రంగనాథ నామ స్మరణతో ఆలయం మారుమోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



పవిత్రాలకు పూజ చేస్తున్న అర్చకుడు



### మందులు లేని వైద్యం

# ఫిజియోథెరపీ

- శస్త్రచికిత్స లేకుండానే పలు వ్యాధులకు చికిత్స
- ఎముకలు, కీళ్లు, నరాల వ్యాధులకు వైద్యుల సిఫార్సు
- ఎన్నో ఆధునిక విధానాలు, పరికరాలు
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ డే

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాధారణ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సల అనంతరం ఫిజియోథెరపీ చికిత్సలకు వైద్య నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ప్రత్యేకించి ఎములు, కీళ్ల, నరాల వ్యాధులకు ఉపసమనం కలిగించే గుణం ఈ వైద్యవిధానంలో ఉంది. పలు వ్యాధులను మందులతో పనిలేకుండా ఫిజియోథెరపీయే నయం చేస్తున్నది. ఏ కారణం చేతనైనా మనిషి శారీరకంగా, మానసికంగా నొప్పి, ఇతర సమస్యలతో బాధపడుతున్నప్పుడు ఆ మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా చేసేందుకు ఇది ఎంతో ఉపయోగ పడుతుంది. 1813వ సంవత్సరంలో స్వీడన్‌కు చెందిన పర్‌హెన్రిక్స్ లింగ్ అనే వ్యక్తి క్రీడాకారుల్లో కలిగే శారీరక సమస్యలు, నొప్పులకు కొన్ని రకాల వ్యాయామ చికిత్సలు, మర్దన పద్ధతులతో చికిత్సలు చేసేవారు. కాలక్రమేణా ఈ విధానాలు 1951లో మనదేశంలోకి ప్రవేశించాయి. తొలుత ఈ వైద్యం పట్ల పెద్దగా ఆదరణ ఉండేదికాదు. అయితే దశాబ్దకాలంగా ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో సెప్టెంబరు 8న(నేడు) ప్రపంచ ఫిజియోథెరపీ డేను జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ తీర్మానించింది. ఇందుకు అనుగణంగా ఫిజియోథెరపీపై ప్రజలకు అవగాహన కలిగించే దిశగా వైద్య నిపుణులు కృషి చేస్తున్నారు.

**ఎన్నో ఆధునిక విధానాలు**

ఫిజియోథెరపీలో ఎన్నో ఆధునిక వైద్యవిధానాలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఆర్థోపెడిక్స్ (ఎముకలు), పీడియాట్రిక్స్ (చిన్న పిల్లల వ్యాధులు), క్యాడో థెరాక్స్ (చెస్ట్), న్యూరాలజీ (నరాలు), స్పోర్ట్స్ (క్రీడలు), మస్కిటో స్కెల్‌టన్ (ఎముకల విభాగం) వంటివి ఫిజియోథెరపీలో ముఖ్యమైనవి. రీహాబిలిటేషన్, ఆర్థోపెడిక్, నరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నుంచి వ్యాధిగ్రస్థులు త్వరగా కోటుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. పక్షవాతం, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులను సైతం ఫిజియెథెరపీ దూరం చేస్తుంది. కీళ్ల సమస్యలు, కీళ్ల అరగటం, పక్షవాతం, పోలియో, కీళ్లవాపు వల్ల వచ్చే నొప్పులను తగ్గించటానికి, ఎముకలు విరిగాక వచ్చే వివిధ సమస్యల నివారణకు ఇది ఉపయోగపడుతుంది. కీళ్ల మార్పిడి



పక్షవాతానికి డీప్ బ్రెయిన్ స్టిమ్యులేటివ్ పరికరంతో చికిత్స

శస్త్రచికిత్స తర్వాత తిరిగి పూర్వ స్థితికి రావటానికి ఫిజియోథెరపీ ఆసరాగా ఉంటుంది. ఆస్తమా, బ్రాంకైటీస్ వంటి శ్వాసకు సంబంధించిన సమస్యలు గుండె శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు త్వరగా కోలుకునేందుకు ఫిజియోథెరపీ వైద్యం సత్ఫలితాలను ఇస్తుంది. 60 ఏళ్ల పైబడిన వారికి ఫిజియెథెరపీ అవసరం ఎంతైనా ఉంది. కరోనా నేపథ్యంలో కరోనా బాధితులకు భుజాల నొప్పులు వచ్చే అవకాశం ఉన్నందున, అలాంటి వారికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగ పడుతుంది.

**అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు**

ఫిజియోథెరపీలో ఎన్నో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్ పెరిఫిషియర్ పరికరం భుజం, మెడ నొప్పులను నివారిస్తుంది. ఈ పరికరం ద్వారా తరంగాలను పంపి కండరాలను సడలింపచేస్తుంది. క్రీడల్లో బెణుకులు, నిద్రలో అచేతనంగా మారిన కండరాలను సడలించేలా ఉపయోగ పడుతుంది. ఇక మజిల్ స్టిమ్యులేటర్ పరికరం పక్షవాతం, మూతివంకర పోయిన వారికి ఉత్తేజాన్ని కలిగించి యథాస్థితికి వచ్చేలా చేస్తుంది. ప్రమాదంలో గాయపడిన రోగులకు చేతులు, కాళ్ల పురరుత్తేజింప చేయటానికి వీల్ యంత్రాలు, లెగ్‌పుల్లు అందుబాటులో ఉన్నాయి. వెన్నుముక, భుజాలకు సంబంధించి కండరాలను సడలించి చేసేందుకు ఎలక్ట్రికల్ ఇంటరాక్ట్ పరికరం ద్వారా 10 రోజుల్లో నయం చేయవచ్చు. అల్ట్రా సౌండ్ థెరపీ పరికరం కండరాల వాపులు, బెణుకులు, క్రీడలలో నరాలు పట్టేయటం వంటి సమస్యలను నివారిస్తుంది. ప్రస్తుతం రోబోటిక్ ఫిజియోథెరపీ విధానం కూడా అందుబాటులోకి వచ్చింది. పక్షవాతాన్ని నివారించేందుకు డీప్ బ్రెయిన్ స్టుమ్యులేషన్ అందుబాటులోకి రావటంతో నేరుగా బ్రెయిన్‌కు ఈ పరికరం ద్వారా వ్యాధిని నయం చేసే వీలుంది.

**వ్యాధిగ్రస్థులకు ఫిజియోథెరపీ ఓ వరం**

పలు వ్యాధులకు పిజియోథెరపీ ఓ వరంలా మారింది. పక్షవాతం వంటి వ్యాధులను సైతం నయం చేసే వీలు డీప్ బ్రెయిన్ స్టుమ్యులేషన్ వంటి పరికరం ద్వారా వీలవుతుంది. చిన్న పిల్లలో వచ్చే అంగవైకల్యానికి సైతం పిజియోథెరపీ కీలకంగా మారింది. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి ఈ వైద్య విధానం తప్పనిసరి అవుతుంది. ఆసుపత్రికి రాలేని రోగులకు ఇంటి వద్దే చికిత్స అందించే సదుపాయం కూడా కల్పిస్తున్నాం. ప్రస్తుతం రోబోటిక్ ఫిజియోథెరపీ వైద్య విధానం కూడా అందుబాటులోకి వచ్చింది.

- డాక్టర్ వినయ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి.



### కార్మిక వ్యతిరేక విధానాలపై

## పోరాడాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో సీఐటీయూ 4వ నెల్లూరు రూరల్ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు కార్మికులను బానిసలు చేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామ న్నారు. కేంద్రం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందానా అంటోందని ఆరోపించారు. విశాఖ ఉక్కును పరిరక్షిం చాలని, పరిశ్రమల పేరుతో కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. దీనికి ముందు నగ రంలో ప్రదర్శన నిర్వహించారు. అనం తరం 35 మందితో నెల్లూరు రూరల్ కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా సుధాకర్, పెంచల నర్సయ్య, కోశాధికారిగా ఖజావలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్‌కుమార్, మాలకొండయ్య, నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



### ఏడేళ్ళుగా

## ఇలా వదిలేశారు...

ఇదిగో.. ఈ చిత్రంలో కనిపిస్తున్న పునాదులు ... అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం కోసం వేసినవి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో వీరంపల్లి, రాజవోలుపాడు, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల కోసం భవనాలు నిర్మించారు. రాజవోలు పాడులో 70 శాతం పూర్తికాగా, లింగారెడ్డిపల్లిలో 50 శాతం పూర్తిచేశారు. అయితే వీరంపల్లిలో పునాదులకే పరిమితం చేశారు. తరువాత 2019లో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటి ఊసే ఎత్తలేదు. 2024లో రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి నిర్మాణాలు పూర్తవుతాయని అనుకుంటే ఏడాదిన్నర అవుతున్నా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని గ్రామస్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

### రోడ్డు ప్రమాదంలో

## ఒకరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన హర్షకుమార్ మోటర్ బైక్‌పై ముత్తుకూరు మండలం ఈపూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా గొలగమూడి సమీపంలో బైకును ఆటో ఢీకొంది. ప్రమాదంలో గా య పడిన హర్షకుమార్‌ను చికిత్స నిమిత్తం గొలగమూడిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

### ట్రాక్టర్, బైకు ఢీకొని వ్యక్తికి...

పొదలకూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ - బైకు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కనుపర్తి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ప్రసాద్ వనంతోపునకు మోటర్ బైకుపై వెళుతుండగా గాలిపాలెం నుంచి కట్టెల లోడుతో పొదలకూరు వైపు వస్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ కుడికాలు నుజ్జునుజ్జయింది.

### రైలు నుంచి పడి

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

మనుబోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మనుబోలు రైల్వేస్టేషన్ పరిధిలో డౌన్‌లైన్‌లో రైలుపట్టాలపై ఓ వ్యక్తి మృతదేహాన్ని కీమెన్ ఆదివారం గుర్తించాడు. రైల్వే పోలీసులకు సమాచారం అందించగా రైల్వే ఎస్‌ఐ హరిచందన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయసు 40 నుడి 45 మధ్య ఉండవచ్చని, ప్రమాదవశాత్తు రైలు నుండి పడిపోయి ఉంటాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

## పోలేరమ్మ జాతర

జలదంకి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జలదంకి పంచాయతీ పరిధిలోని గమళ్లపాలెంలో ఆదివారం పోలేరమ్మ జాతర నిర్వహించారు. పోలేరమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాయుడు రాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధురెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలి

- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలని, అలా జీవించాలని 37 ఏళ్లగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ తెలిపారు. నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జేవీవీ 18వ జిల్లా మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎందరో శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ఇతర రంగాలకు చెందిన వృత్తి నిపుణులు జనవిజ్ఞాన వేదికలో ఉన్నారని చెప్పారు. సైన్సుకు సంబంధించి ఏ అంశం గురించి అయినా, విపరీత అనారోగ్య పరస్థితులు తలెత్తినా, మూఢనమ్మకాలు చెలరేగినా జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు ముందుండి పరిష్కారానికి పనిచేస్తుంటారని వెల్లడిం చారు. అనంతరం జేవీవీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కాలేషాబాషా, కామయ్య, పెంచలయ్య ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంవీ చలపతి, విజయకుమార్, కోశాధికారిగా బుజ్జయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చొప్పా రవీంద్ర, కృష్ణారెడ్డి, విద్యాచరణ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్

## రాష్ట్ర క్యారమ్స్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లాకు చెందిన నిమ్మకాయల వెంకయ్య ద్వితీయ స్థానం సాధించారని క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని నెల్లూరు క్లబ్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు క్లబ్ సెక్రటరీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, క్రికెట్ మాజీ రంజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, క్యారమ్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు

## తండ్రి మందలించాడని కుమార్తె బలవన్మరణం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లడం లేదని తండ్రి మందలించాడన్న మనస్తాపంతో ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్లోని కోడూరుపాడు కల్తీకాలనీలో నివాసముంటున్న పట్టపు రవి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని కుమార్తె నవ్య (21) నెల్లూరులోని వివేకా నంద కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 5వ తేదీన కళాశాలకు వెళ్లలేదని రవి మందిలించడంతో నవ్య మనస్తాపం చెంది అదే రోజు మధ్యాహ్నం గడ్డిమందు తాగింది. గమ నించిన కుటుంబ సభ్యులు ఆమెను నెల్లూరులోని ఆసుపత్రికి తరలించి అక్కడ్నుంచి తిరుపతిలోని సిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు సీఐ గుంజి వేణు పేర్కొన్నారు. ఆదివారం కేసు నమోదు చేశామని తెలిపారు.

## ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

- రెండోసారి అధ్యక్షుడిగా అల్లంపాటి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘానికి వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా నుడాలో కార్యదర్శిగా పనిచేస్తున్న అల్లంపాటి పెంచలరెడ్డి ఎన్నికయ్యారు. ఆ అసోసియేషన్‌కు ఆదివారం కలెక్టరేట్‌లోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో ఎన్నికలు జరిగాయి. అసోసియేట్ అధ్యక్షుడిగా బొబ్బా మురళి, ఉపాధ్యక్షులుగా పీ హేమంత్ కుమార్, పీ శ్రీనివాసులు, కేసీహెచ్ అనిల్ కుమార్ యాదవ్, మహిళా ఉపాధ్యక్షు రాలిగా కే బాలకోటమ్మ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వై నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీ వెంకటేష్, స్పోర్ట్స్-కల్చరల్ కార్యదర్శిగా వీ ఆనంద్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఈ రమాదేవి, ఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఏ అశోక్ వర్ధన్, కే అలరేష్, ట్రెజరర్‌గా జీ సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. పెంచలరెడ్డి మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు పనిచేస్తానని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ కార్యవర్గానికి ఏజీపీటీఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్టీ రాంప్రసాద్ అభినందనలు తెలిపారు.



ఏపీఆర్ఎస్ఏ నూతన కార్యవర్గం

### చిప్పలేరు వాగులో

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె జడగోగుల మధ్య ఉన్న చిప్పలేరు వాగులో గుర్తుతెలియని 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. ఎస్‌ఐ ప్రభాకర్‌రావు కథనం మేరకు.. మృతుడి కుడి చేయిపై నాగులూరి సింగయ్య, సుశీలమ్మ అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహం పరిస్థితిని బట్టి మూడు రోజుల క్రితం మృతి చెంది వాగులో కొట్టుకు వచ్చి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. జువ్వలదిన్నె వీఆర్‌వో బాలనరసింహం, వీఆర్‌ఏ పెనుగొండయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

బిట్రగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని తలమంచి, కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య (45) మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు కావలి జీఆర్పీ ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నోవల్ టోప్పోగా గుర్తించారు. మృతుడి వద్ద రాయగడ్ నుంచి విజయవాడ వరకు రైలు టికెటు మాత్రమే ఉంది. ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రైల్లో నుంచి పడి మృతి చెందిన నోవల్ టోప్పో

## తండ్రీ, కొడుకు ఘర్షణ

- అడ్డువెళ్లిన మహిళ మృతి

కొండాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తండ్రీ, కొడుకు ఘర్షణ పడుతుండగా అడ్డు వెళ్లిన మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని శెట్టిపాలెం ఎస్సీకాలనీలో జరిగింది. ఎస్‌ఐ మాల్యాద్రి కథనం మేరకు.. శెట్టిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మిట్టా సురేష్, అతని కుమారుడు జశ్వంత్ ఘర్షణ పడుతుండగా సురేష్ అత్త తులిబెల్లి ధనమ్మ(63) వారిని ఘర్షణ పడకుండా నివారించేందుకు అడ్డువెళ్లింది. ఆ సమయంలో వారికి ఏమి జరుగుతుందోనన్న టెన్షన్‌లో ఆమెకు గుండెపోటు వచ్చి కిందపడి స్పృహ కోల్పోయింది. తక్షణం బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వింజమూరులోని ఓ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమెకు 15 ఏళ్ల క్రితం గుండె ఆపరేషన్ చేసి ఉన్నారు. మృతురాలి భర్త తులిబెల్లి పెదమాలకొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 120 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 242 |

కోడిగుడ్ల ధర (100): 545

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.10243 |
| వెండి కిలో ధర | రూ. 127700 |
| వెండి ఒక గ్రాము | రూ.130.70 |

## రాంబాబుకు ఘన సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పోకూరి రాంబాబును ఆదివారం పలువురు ఉపాధ్యాయులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. కందుకూరి సుబ్బనాచారి, సంగా మహేంద్ర, చల్లా బ్రహ్మయ్య, వేమా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు రాంబాబును కలిసి కందుకూరు ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి పని చేయాలని ఆకాంక్షించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● పాఠశాలకు రూ.లక్ష వితరణ



గురువు తెలికేపల్లి శ్రీనివాసులును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలి(టౌన్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వోదయ బాలురు ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రాస ప్రావీణ్యుడు అన్నదాత మణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు భీమరాజు మధుసూదనాచార్యులు, సుధాకర్ పాల్గొన్నారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయుడు తెలికేపల్లి శ్రీనివాసులును శాలువా, పూలమాలతో పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. 65 ఏళ్ల వయస్సులో వారంతా పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థి నారాయణరెడ్డి పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారాకానాథ్ చౌదరి, పూర్వ విద్యార్థులు చేవూరు అజయ్‌కుమార్, టీవీఎంఎస్ ప్రకాష్, ఎంవీ రామారావు, విష్ణు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తుత్తి హామీగా ఉపాధి హామీ పథకం

కావలి(టౌన్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ఉత్తుత్తి హామీగా మారిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శివరామసుబ్బయ్య భవనంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి 6వ మహాసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదని, కావలిలో 14 వారాలకు పైగా ఉపాధి హామీ డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. వేతనం రోజుకు రూ.307 ఇవ్వాల్సి వుండగా వంద నుంచి 150 రూపాయలు చెల్లిస్తున్నారన్నారన్నారు. పని ముట్లు ఆటో చార్జీలు ఇవ్వడంలేదని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలు ఆచరణ శూన్యమన్నారు. కార్యక్రమంలో వేముల శీతారామయ్య, రాధాకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరు ఏరియా ఆసుపత్రికి కొత్త అంబులెన్స్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రికి ప్రభుత్వం నూతన 108 వాహనాన్ని మంజూరు చే సింది. అత్యాధునిక లైఫ్ సపోర్టు వైద్యపరికరాలతో కూడిన ఈ వాహనాన్ని ఆసుపత్రికి సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆదివారం ప్రారంభించారు. ఈ అంబులెన్స్ సహాయంతో అత్యవసర సేవలకు వీలవుతుందని ఆమె పేర్కొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

జలదంకి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతీ పౌరుడు అవగాహన పెంచుకొని సమాజంలో జరిగే అవినీతిని చట్టం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్రకమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రూ.20 కోట్ల అడ్డ కాలువ భూముల

# పరిరక్షణకు చర్యలు

● ఎట్టకేలకు సర్వే చేపట్టిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ● హద్దు రాళ్ల ఏర్పాటుకు శ్రీకారం

కావలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి తూర్పుభాగంలో ఆక్రమణలకు గురైన సుమారు రూ.20 కోట్ల విలువైన అడ్డకాలువ భూముల పరిరక్షణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజులుగా సర్వే చేపట్టి హద్దు రాళ్లు నాటించే కార్యక్రమం వేగవంతంగా జరుగుతోంది. అత్యంత విలువైన అడ్డకాలువ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడంతో జలవనరులశాఖ అధికారులు విన్నపం మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. దీంతో సుమారు 6 ఎకరాల వరకు భూములు ఆక్రమణలకు గురైనట్లు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. ఈ భూములు విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుంది. కావలి పట్టణ మద్దూరుపాడు రోడ్డు నుంచి గాయిత్రినగర్, పాతూరు మీదుగా పట్టణ తూర్పు వైపున ఉన్న రిల్ఎస్టేట్ ప్లాట్లలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల మధ్యలో నుంచి తుమ్మలపెంట రోడ్డులోని తాళ్లపాలెం వరవ కాలువ వరకు ఆ అడ్డ కాలువ విస్తరించి ఉంది. గతంలో పట్టణానికి తూర్పున పూర్తిగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని ఒకసారి సర్వే చేయగా మున్సిపల్ అధికారులు కచ్చా కాలువ కొట్టారు. అయితే కాలువను ఆ భూమికి రెండు వైపులా కొంత వదిలేసి మధ్యలో కాలువ తీయటంతో రెండు పక్కలా మిగిలిన భూమిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని తమ ప్లాట్లలో కలుపుకున్నారు. దీంతో ఆ ప్లాట్లను ఎవరికైనా విక్రయిస్తే కొనుగోలు చేసిన వారు నష్టపోనుండటంతో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు కదిలారు. తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్ చొరవ



అడ్డ కాలువ హద్దులకు సర్వే రాళ్లు నాటుతున్న కూలీలు

తీసుకుని దానిని మళ్లీ జలవనరులశాఖ అధికారుల సమక్షంలో సర్వే చేయించారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు తమ స్థలాలు ఎంతవరకు ఉన్నాయో అంత వరకు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుండటంతో విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ కలిగినట్లైంది.

## కార్మికుల సమస్యలపై స్పందించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

ఉలవపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యలపై పీటీపీ పొగాకు కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వీడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే అజయ్‌కుమార్ కోరారు. ఆదివారం జరిగిన కరేడు ర్యాంపు పీటీపీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో కార్మిక శాఖ జిల్లాస్థాయి అధికారులు ప్రతినెల తనిఖీలు నిర్వహించి, కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. 200 మంది ఉండే పరిశ్రమలో వాహన సదుపాయం, ఈఎస్‌ఐ సౌకర్యం లేదన్నారు. పొగాకు త్రెస్సింగ్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు ఊపిరి తిత్తుల వ్యాధితో ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికే కొందరు మరణించారన్నారు. కార్మికులకు రక్షణ చర్యలతోపాటు ఫెస్టివల్ అడ్వాన్సు, ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొదటిసారిగా డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

### చంద్ర గ్రహణంతో ఆలయాల మూత



మూసివేసిన ముసునూరులోని ఆంజనేయస్వామి క్షేత్రం

కావలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణంతో పట్టణంలోని అన్ని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతవేశారు. పట్టణంలో ప్రధానమైన కలుగోళ్ల శాంభవి ఆలయం, విష్ణాలయం, పాతూరు శివాలయం, సాయిబాబా మందిరం, సత్యనారాయణస్వామి ఆలయం, ముసునూరులోని ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేశారు.

● బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం మూసివేశారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ కార్యక్రమ అనంతరం యధావిధిగా శ్రీవారి దర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు. బిట్రగుంట, చెంచులక్ష్మీపురం, నాగులవరం, చెన్నారెడ్డిపాలెం, జువ్వలదిన్నెలో ఆలయాలను మూసివేశారు.

## మద్దతు ధరకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

అల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన రెండోకారు ధాన్యానికి మద్దతు ధర కల్పించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రేడ్-1 ధాన్యానికి రూ.20,306, సాధారణ రకానికి రూ.20,136 వంతున ధరను నిర్ణయించి ప్రభుత్వమే కానుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర సాధనకు ఈనెల 9న నెల్లూరు గాంధీబొమ్మ సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు జరుగబోయే ప్రదర్శనలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోపసాని రమేష్, పాటి భాస్కర్, షేక్ రషీద్, నేతగాని రమణయ్య, కంచుపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి(ఆంధ్రజ్యోతి):** రెండో పంట ధాన్యం ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు రావి మాల్యాద్రి అధ్యక్షతన మండల రెండవ మహాసభ జరిగింది. ఈ మహాసభలో అధ్యక్షుడిగా రావి మాల్యాద్రి, ప్రధానకార్యదర్శిగా గడ్డం మాల్యాద్రి, 6మంది కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ జిల్లాలో రెండోకారులో పండించిన ధాన్యంను దళారీలు రూ.15, రూ.16వేలకు అడుగుతున్నారని ఈ ధరకు అమ్మితే రైతులు దివాళా తీస్తారని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా జిల్లా రైతుసంఘం ప్రధానకార్యదర్శి మూలి వెంగయ్య, నాయకులు మేలంగి ఆంథోనీబాబు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### నేటి నుంచి ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆధార్‌కార్డులు లేని ఎస్టీల కోసం ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ మండలంలోని గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. కేవలం ఆధార్ లేని ఎస్టీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన ఈ ఆధార్ క్యాంపులను ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బీవీ రమణకు ఘన సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత బీవీ రమణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక జనార్ధనస్వామి దేవస్థానం నూతన కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులతో పాటు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని బీవీ రమణ, సులోచన దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, రంగశెట్టి రమేష్, కొల్లి రమావతి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై.హనుమంతరావు, అశోక్‌బాబు, కేవీ జాన్సన్, బండి గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

### 'త్రైక్వోండో'తో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు

బిట్రగుంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తైక్వోండో మార్షల్ ఆర్ట్స్ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని స్థానిక ఎస్‌ఐ ఎస్.ప్రభాకర్, దగదర్తి ఎస్‌ఐ జంపానికుమార్‌లు పేర్కొన్నారు. బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్ నేషనల్ తైక్వోండో మాస్టర్ ఈ.రవిగన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. 23 మంది విద్యార్థులు బెల్ట్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనగా అందులో 8 మంది అత్యధిక ప్రతిభను ప్రదర్శించి డబుల్ ప్రమోషన్ పొందారు. వారికి బెల్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ మాజీ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, స్వర్ణన్‌రాజ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల్లో పౌర్ణమి పూజలు



హోమం చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సంగం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమన కొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞాన పీఠంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం హోమం, లలిత సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ పీఠాదిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు ప్రాణయామం, ధ్యానం, యోగా ప్రాధాన్యతను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా కోలగట్లలోని నాగవరపమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పొంగించి పౌర్ణమి పూజలు నిర్వహించారు. పూజలనంతరం ఆలయాలను మూసి వేశారు.

### మంత్రి ఆనంను కలిసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్



మంత్రి రామనారాయణరెడ్డిని కలిసిన షేక్ సల్మాషిరీన్, టీడీపీ నాయకులు

చేజర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ జడ్పీటీసీ సభ్యురాలు షేక్ సల్మా షిరీన్‌ను ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండల టీడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, మాజీ ఎంపిపిలు రావి పెంచలరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులునాయుడులతో కలసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్మి సిద్దులనాయుడు, జయంతులునాయుడు, చీర్ల వెంకటేశ్వర్లు, మస్తాన్, బాబు, ఆదినారాయణ రెడ్డి పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారిపై ఇసుక

● జారిపడితే అంతే సంగతులు



దారి పొడవునా ఉన్న ఇసుక

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణాలను సులభతరం, వేగవంతం చేసేందుకు నిర్మాణాలు చేపట్టిన జాతీయ రహదారులు కొంతమంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలో జడదేవి నుంచి భోగ్యం వారిపల్లి వరకు 565 జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడం జరిగింది. తొలుత ఎంతో సంబరపడిన ప్రజలు క్రమేణా భయాందోళనలతో కాలం వెల్లబుచ్చాల్సిన దుస్థితి నెలకొంది. మారుమూల పల్లె ప్రాంతాలు కావడంతో అధికారుల పర్యవేక్షణ, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఆ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మితిమీరిన వేగంతో పాటు రాత్రింబవళ్లు రహదారిపై సంచరిస్తున్న పశువులను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఇసుక వ్యాపారులు స్థానిక గ్రామాలతో సహ జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీస జాగ్రత్తలు పాటించక పోవడంతో వాహనాల్లోని ఇసుక దారి పొడవునా రహదారిని కమ్మేస్తుంది. దీంతో ఆ మార్గంలో పరుగులు తీసే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా మార్జిన్లలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఎక్కడ జారి పడాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వ్యవసాయ సహకార సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్

సీతారామపురం, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సొసైటీ అభివృద్ధికి కమిటీ కృషిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. మండల కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీతారామపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి 50 ఇళ్లకు ఒక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగు తుందని, సీసీ రోడ్లు లేని ప్రతి గ్రామంలో రోడ్డు వేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అలాగే సీతారామపురం హైవే కూడలి వద్ద నుంచి నాలుగు పంచాయతీలను కలుపుతూ రూ. 80 కోట్లతో ఆర్అండ్‌బి రింగ్‌రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మరోసారి వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పి నియోజకవర్గంలోని 143 పంచాయతీలను గెలుచుకుంటామనే నమ్మకం ఉందని, ఆ దిశగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, సొసైటి అధ్యక్షుడు రాజశేఖర్, ముత్తంశెట్టి చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొడవటికంటి భాగ్య కుమారి, షేక్ బాబు, జాషువా, ఇబ్రాయిల్, ఆదినారాయణ, తమిశెట్టి రమణయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, కాశీరత్తయ్య, ఎడమ ప్రవీణ్, దేవర వెంకటేశ్వర్లు, చంద్రరెడ్డి, పాల్గొన్నారు.

### యాదవపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవపాళెంకు గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ఈ దుస్థితి నెలకొందని, గుక్కెడు నీటి కోసం కష్టాలు పడుతున్నామని ఆప్రాంత ప్రజలు వాపోయారు. నగదు వెచ్చించి ట్యాంకర్లు కొనుగోలుచేసి నీటి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయించేందుకు తీసుకెళ్లారని, రాగానే ఏర్పాటుచేసి నీటి సమస్య తీరుస్తామన్నారు.

### అందని స్మార్ట్ రేషన్ కార్డులు

● ఆందోళనలో లబ్ధిదారులు

అనంతసాగరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా 37 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం పారదర్శకంగా సరకులు పంపిణీ చేసేలా అందజేసిన స్మార్ట్ రేషన్‌కార్డులు మండలంలో పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదు. ఇవి ఎవరు ఇస్తారు.. ఎక్కడ ఉన్నాయి.. అనే సందేహాలతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అందని వారికి కార్డులు పంపిణీ చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

### గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్రంగా గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలని ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో జిల్లా యాదవ, బీసీ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలిన గాయాలతో ఇప్పటికీ వైద్యశాలలో చిన్నారులు చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలో సమగ్ర విచారణ జరిపి ఈ చర్యలకు ప్రేరేపించిన, పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. చిన్నారులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు వారికయ్యే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ, బీసీ సంఘ నాయకులు కిశోర్, రమణయ్య, మధుసూదన్‌రావు, పద్మజ, మహేష్, రజని, శైలజ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఏఎస్‌పేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన యూరియా అధికంగా వాడితే కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

## దెబ్బతిన్న ఆర్అండ్‌బి రహదారి అంచులు


● వాహనదారుల అవస్థలు



ప్రమాదకరంగా మారిన రహదారి అంచులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ అండ్ బీ రహదారుల అంచులు దెబ్బతిని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు ఎదురుగా వచ్చినా, ముందు వెళ్లే వాటిని క్రాస్ చేసే సమయంలోను ఒక్కసారిగా రోడ్డు దిగే క్రమంలో వాహనదారులు జారిపడి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలోని పెద్దిరెడ్డి పల్లి, ధర్మవరం, నార్త్‌కొండాయపాళెం, విరువూరు తదితర గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారి వెంట బాగా దెబ్బతిన్న అంచులే దారి పొడవునా దర్శనమిస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

### గ్రహణంతో ఆలయాల మూత



మూతపడిన సంగమేశ్వరాలయం

సంగం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. రాత్రి చంద్ర గ్రహణం ఏర్పడనుండడంతో సంగమేశ్వరాలయాన్ని మూసివేశారు. అదే విధంగా వంగల్లులోని బీమేశ్వరాలయం, మర్రిపాడులోని చెన్నకేశవస్వామి, దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు.

### కాటేపల్లి పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

వింజమూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి హైస్కూల్‌కు ప్రహరీ లేక అపరిశుభ్రంగా తయారవడమే కాకుండా పశువులు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్న తరుణంలో నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నైట్ వాచ్‌మెన్ ఆర్థిక సహాయంతో పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

### జాతీయ రహదారిపై హైమాస్ట్ వెలుగులు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కూడలిలో హైమాస్ట్ దీపాల వెలుగులు

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం - ఉదయగిరి మార్గంలోని 167-బీజీ జాతీయ రహదారిపై హైమాస్ట్ దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. రహదారి కూడలి ప్రాంతాల్లో కొన్నినెలల కిందట విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో వాహనదారులు పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద హైమాస్ట్ దీపాలు వెలుగులు విరజిమ్మడంతో వాహనదారుల ఇబ్బందులు తొలిగాయి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 8 సెప్టెంబరు 2025


గోవిందరాజస్వామి ఆలయ గోపురం వద్ద..





# చంద్రగ్రహణం వీక్షణ

ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా తిరుపతి నగరం ఇందిరా మైదానం వద్ద జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టెలిస్కోప్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా నగరవాసులు చంద్రగ్రహణాన్ని ఆసక్తిగా వీక్షించారు.


గరుడ సర్కిల్ వద్ద..

## శ్రీవారి ఆలయం మూత




నిర్మానుష్యంగా శ్రీవారి ఆలయ ప్రాంతం - మూసివేసిన మహద్వారం తలుపులు ముందు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు, అర్చకులు

**చంద్రగ్రహణం:** ఆదివారం రాత్రి 9.50 నుంచి సోమవారం వేకువజామున 1.31 గంటల వరకు

**శ్రీవారి ఆలయం మూతపడింది:** మధ్యాహ్నం 3.30 గంటలు

**తిరిగి తెరచుకునేది:** సోమవారం వేకువజాము 3 గంటలకు

ఆదివారం వేకువనుంచి మధ్యాహ్నం వరకు 27,525 మంది భక్తులకు శ్రీవారి దర్శనం చేయించి క్యూలైన్లను మూసివేశారు. ఏకాంత సేవ నిర్వహించి తలుపులు మూసివేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్లు మూతపడ్డాయి. వీటిని సోమవారం ఉదయం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. అన్నప్రసాద కేంద్రాల మూత నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ముందుగానే 50 వేల పులిహోర ప్యాకెట్లను వితరణ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


నిర్మానుష్యంగా అలిపిరి తనిఖీ కేంద్రం


ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం





మూత వేసిన పద్మావతి అమ్మవారి ఆలయం

## అమ్మవారి ఆలయం..

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం మధ్యాహ్నం 2.15 గంటలకు మూతపడింది. అలాగే, తిరిగి టీటీడీకి చెందిన సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీనివాస ఆలయం, ఉపాలయాల ద్వారాలను అధికారులు మూసివేశారు. సోమవారం ఉదయం తిరిగి ఆలయాన్ని తెరచి శుద్ధి, సంప్రోక్షణ తరువాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

అమ్మవారి ఆలయాన్ని మూతవేస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు



## శ్రీకాళహస్తిలో గ్రహణ కాల అభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అర్ధరాత్రి గ్రహణ కాలం పురస్కరించుకుని మూలమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 9గంటల వరకు ఆలయాన్ని యథావిధిగా తెరచి ఉంచి భక్తులకు రోజులాగే దర్శనం కల్పించారు. గ్రహణ కాలం అర్ధరాత్రి వేళ కావడంతో ఆ సమయంలో అభిషేకాలను ఏకాంతంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో కావడంతోపాటు చంద్రగ్రహణం రోజున ముక్కంటి ఆలయం మాత్రమే తెరవడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 76, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,817మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,425మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,461మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,250, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 440మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 375మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 141మంది పూజలుచేయించుకున్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


దర్శనానికి వెళుతున్న భక్తులు

# పీజీ అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 22 నుంచీ పీజీ ఫస్టియర్ తరగతులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆదివారం అడ్మిషన్ కమిటీ సమావేశమై నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి 15వ తేదీ దాకా వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 9 నుంచీ 16 వ తేదీ దాకా వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. 12 నుంచీ 17 వ తేదీ దాకా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 18న వెబ్ ఆప్షన్లు మార్పుచేర్పులు చేసుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు. 22 నుంచీ 24వ తేదీ దాకా సీటు వచ్చిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. అదే సమయంలో ఈనెల 22 నుంచే పీజీ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది.

# ముగిసిన కంచి స్వాముల చాతుర్మాస దీక్ష

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ద్వారకానగర్‌లోని కంచి కామకోటి మహాపాదుక మండపంలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి చేపట్టిన చాతుర్మాస దీక్ష ఆదివారం ముగిసింది. ఇక్కడి పీఠం మండపంలో జూన్ 7వ తేదీన కంచి స్వాములు చాతుర్మాస దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో భాగంగా పాదుక మండపంలో పలు పూజలు, వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. దీక్ష ముగింపు సందర్భంగా ఆదివారం పాదుక మండపం నుంచి నగరవనం వరకు విశ్వరూప యాత్ర నిర్వహించారు. నగరవనం చేరుకుని భగవద్గీత 11వ అధ్యాయంలోని విశ్వరూపయోగ పారాయణం చేశారు. అనంతరం ఊరేగింపుగా పాదుక మండపం చేరుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు కంచి స్వాములు ఆశీర్వచనాలు అందించారు. మంగళవారం వరకు కంచి స్వాములు పాదుక మండపంలోనే ఉండి తర్వాత కంచి పీఠానికి వెళ్లనున్నారు. నాడు విజయేంద్ర సరస్వతి తొలి చతుర్మాస దీక్ష ఆంధ్రప్రదేశ్‌లో జరగ్గా.. ఇప్పుడు సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి తొలి దీక్ష కూడా రాష్ట్రంలోనే జరగడం గమనార్హం.


నగరవనంలోని ఉద్యానవనంలో కంచి స్వాములు

# అధికారులూ ఇదేమి తీరు!

- నెర్రికాలువ గండికి అటువైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం
- గండి పడిన చోట చెరువు మట్టితో పూడ్చడంపై రైతుల ఆగ్రహం


వాటంబేడు చెరువులో మట్టిని ఎక్స్‌కవేటర్ ద్వారా లారీకి నింపుతూ..


నెర్రికాలువ గండి పడిన చోట కాంక్రీట్ వాల్ నిర్మాణం లేకుండానే మట్టితో పూడ్చి చదును చేశారిలా..

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నెర్రికాలువ గండి పూడ్చివేత పనుల్లో ఇరిగేషన్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. లూథరిన్ చర్చి వైపు హడావిడిగా కాంక్రీట్ వాల్ నిర్మించిన అధికారులు.. నెర్రికాలువకు గండిపడిన చోట మాత్రం చెరువు మట్టిని తోలి చదును చేస్తున్నారు. జీఎన్‌టీ రోడ్డులోని లూథరన్ చర్చి వెనుకాలే ఉన్న నెర్రికాలువకు గతేడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు భారీగండి పడింది. జనవరిలో తాత్కాలిక మరమ్మతుల కింద ఇసుక బస్తాలు వేశారు. గండిపడిన చోట పూడ్చేందుకు శాశ్వత కాంక్రీట్ వాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.39 లక్షలు కేటాయించింది. కాలువకు గండిపడిన ప్రాంతంలో కాకుండా చర్చి వెనుకవైపు ఉన్న కట్టను తప్పి అధికారుల సమక్షంలో కాంక్రీట్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గండిపడిన చోట కూడా కాంక్రీట్ వాల్ నిర్మిస్తామని అధికారులు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఇదే మాట ఎమ్మెల్యే విజయశ్రీకి కూడా చెప్పారు. కానీ, చర్చి వైపు కాంక్రీట్‌వాల్ నిర్మాణం పూర్తి చేశారు. తర్వాత సమీపంలోని వాటంబేడు చెరువు నుంచి మట్టి తోలి నెర్రికాలువ గండిని పూడ్చి కేవలం మట్టితోనే పొర్లుకట్టను చదునుచేస్తున్నారు. పక్కనే కాళంగి నది ఉండడంతో పొర్లుకట్ట ఏమాత్రం బలహీనమైన మళ్లీ గండిపడే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు ఇదేమని ప్రశ్నిస్తే సమయం లేదు ప్రస్తుతం తాత్కాలికంగా గండిని పూడ్చి పొర్లుకట్టకు మట్టితో చదును చేసి సాగునీళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తప్పించుకున్నారు. నెర్రికాలువ గండిపూడ్చేందుకు మంజూరైన నిధులను ఇలా బూడిదలోపోసిన పన్నీరుగా అధికారులు దుర్వినియోగం చేశారని రైతులు ఆగ్రహిస్తున్నారు. అసలు పొర్లుకట్టకు రైతుల సాగునీటికి ఉపయోగపడే చెరువుల నుంచి మట్టిని తరలించకూడదు. కానీ చెరువు మట్టిని ఎక్స్‌కవేటర్లతో తవ్వి లారీలకు నింపి నిత్యం తరలిస్తున్నారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల హస్తం కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మరింత మెరుగ్గా సచివాలయ వ్యవస్థ

- మూడంచెల పర్యవేక్షణకు కార్యాచరణ

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసి మరింత మెరుగైన సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిపై పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినా.. వాటిపై పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5225 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు క్షేత్రస్థాయిలో సచివాలయాల నుంచే అందుతున్నాయి. ఇక్కడి ఉద్యోగులంతా ఇంచుమించుగా ఒకే కేడర్‌కు చెందినవారు కావడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఈ క్రమంలో వీటిపై పర్యవేక్షణకు జిల్లాలో డీఎల్డీవో, జేడీ స్థాయి అధికారిని గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా నియమిస్తారు. సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. వీరితోపాటు ఇద్దరు సాంకేతిక సమన్వయకర్తలు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు.




మండలస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ మండల అధికారి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. గ్రేడ్-1, 2 పురపాలక సంఘాల్లో మేనేజరు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. నగర పంచాయతీల్లో ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు. ఇలా గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ ఏర్పాటుకు గతవారం ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ జగదీష్ చెప్పారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం అడుగులు వేయాలి

- దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలి
- ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్


మాట్లాడుతున్న ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

తిరుపతి(వైద్యం),సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. గత ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేయడంతో కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తున్నారు. అటువంటి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలి' అని ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలవుతున్నా ఉద్యోగులు తమ బకాయిల, ఇతర సమస్యల విషయంలో ఎలాంటి ఒత్తిడి చేయకుండా ఎదురు చూస్తున్నారన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయం జరిగేలా తక్షణమే కొత్త కమిషన్ వేయాలన్నారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.30 కోట్ల వరకు ఉద్యోగుల బకాయిలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఫోరంను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల డిమాండ్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ వివరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి నేతలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్‌గా సురేష్‌బాబు, కోకన్వీనర్‌గా రఘు, కోశాధికారిగా లలితకుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్, సభ్యులుగా చెంచురత్నం, ఫణీంద్ర, జనార్దనయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కడప, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులు, పెంచల్‌రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి తాలూకా అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అమ్మవారి పవిత్రోత్సవాలు



తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు కేటీ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి, సుదర్శన చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. చక్రతళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో మూడు సార్లు మునక వేయించడంతో చక్రస్నానం ముగిసింది. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠస్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పద్మసరోవరంలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## ప్రజల జీవన ప్రమాణాల పెంపునకే సూపర్ సిక్స్



సూపర్ సిక్స్ ర్యాలీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేతలు కొండేపాటి గంగాప్రసాద్, ఆకుతోట రమేష్, బొమ్మన్ శ్రీధర్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగా ప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలో సూపర్ సిక్స్. సూపర్ హిట్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఎమ్మెల్యే, కొండేపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ ర్యాలీని ప్రారంభించారు. బాపూజీ వీధి మీదుగా వినాయకుడి గుడి సెంటర్, జీఎన్టీ రోడ్డు గుండా ఎస్‌కేఎస్ కల్యాణ మండపం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని చంద్రబాబు అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమ న్నారు. సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం, స్త్రీశక్తి, ఉచిత గ్యాస్ వంటి పథకాలతో గ్రామాల్లో ప్రజలు జీవన ప్రమాణాలు మెరు పడ్డాయ న్నారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు వద్దనున్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలను విడిచిపెట్టి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు గొడలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామన్నారు. త్వరలో రానున్న ఆంజనేయస్వామి జెండా ఉత్స వాల్లో డీజేలకు అనుమతిలేదన్నారు. ఆంజనేయస్వామి జెండా, దసరా ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఉత్సవాల్లో ఎక్కువ శబ్దాలతో వాయిద్యాలు ఏర్పాటు చేయకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసు కుంటామన్నారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రౌడీషీటర్లను బైండోవర్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



బీసీ వసతి గృహ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం కల్పించేది టీడీపీయేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బనిగీ సాహెబ్‌పేటలో బీసీ వసతిగృహ అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుంద న్నారు. బీసీ విద్యార్థులు చదువుల్లో రాణించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీల కోసం ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు వసతులు కల్పించి చదువులు సాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, ధనుంజయరెడ్డి, జహంగీర్, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, అల్లీహుస్సేన్, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఆటుపోట్లు సహజం



వెంకటరమణను సన్మానిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

కోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు సహజమని, వాటిని ఎదుర్కొని నిలబడటమే ధృడ సంకల్పమని సీఐ తురకా వెంకటరమణ(గబ్బర్‌సింగ్) అన్నారు. కోటలోని షాదీమందిర్‌లో ఆదివారం రాత్రి వెంకటరమణను పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, యువ కులు, పూలమాలలు, శాలువాలతో అభినందించారు. గతంలో కోట ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఆయన ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు. ఆదివారం కోటకు వచ్చిన ఆయనను పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భారీ గజమాలలతో స్వాగతించారు. స్థాని ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మోటారు బైక్‌లతో ర్యాలీగా షాదీ మందిర్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన అభినందన సభలో పలువురు మాట్లాడుతూ వెంకటరమణ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ధైర్యం, నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి చట్టానికి అందరూ సమానమే అన్న నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లిన వ్యక్తి వెంకట రమణ అని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ప్రతినిధులు కర్లపూడి రాంబాబు, దిలీప్‌కుమార్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రామకృష్ణరావు, మీజూరు మాధవ్, మల్లికార్జునరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నాయుడుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికు లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్ర హ్మణ్యం అన్నారు. నాయుడుపేట సుందరరామిరెడ్డి సీఐటీయూ కార్యాల యంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన కోర్కెల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులు ఐక్యమత్యంగా ఉండి చట్టపరమైన పోరాటాలతో తమ కోర్కెలను సాధించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎస్‌కే వజీ రియా, ఉపాధ్యక్షులుగా జయమ్మ, కళ్యాణి, కార్యదర్శిగా విజయమ్మ, కోశాధికారిగా రాణి, కార్యదర్శులుగా సుగుణమ్మ, లక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద, నెలవల శ్యామలమ్మ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఎన్ఎం అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత చెన్నారెడ్డి సుధాకర్‌రెడ్డి(75) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడు తున్న ఆయన హైదరబాద్‌లో చికిత్స పొం దుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామా నికి తీసుకువచ్చారు. సోమ వారం సాయం త్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కు టుంబ సభ్యులు తెలిపారు. సుధాకర్‌రెడ్డి రెండు పర్యాయాలు టీడీపీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. అలాగే అక్కరపాక సర్పంచ్‌గా, సూళ్లూరు పేట ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా, నెలబల్లి సొసైటీ డైరెక్టర్‌గా, నెల్లూరు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు.

## డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

నాయుడుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన పెరిచర్ల కిషోర్‌బాబు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండ డంతో బలిజ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రదీప్, కార్యదర్శి హంసాపృథ్వీ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం, రామలింగేశ్వర ఆలయం వద్ద ఆక్రమణకు గురౌప కౌవల్యా నది

# కైవల్యా నదిని ఆక్రమించేస్తున్నారు..!

- బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు
- రికార్డుల్లో వంక కాలువగా నమోదు
- కౌన్సిల్‌లో ప్రశ్నించినా పట్టించుకోని అధికారులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలంలో కొండలు, గుట్టలు, కాలువలు, చెరువులతో పాటు చివరకు నదులనూ ఆక్రమించేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న కైవల్యా నది ఆక్రమణలకు గురౌతోంది. వర్షాకాలంలో కౌవల్యా నదిలో 30అడుగుల వరకు వరదనీరు ఉప్పొంగుతుంది. నవంబరులో వెలిగొండల్లో నుంచి గొడ్డేరువాగు ద్వారా వర్షపు నీరు నదిలో కలుస్తుంది. దీంతో సమీపంలోని నివాస గృహాలకు ముంపు ప్రమాదం ఏర్పడుతూ ఉంటుంది. అయితే పట్టణంలో కైవల్యా నదికి ఇరువైపులా బఫర్ జోన్ ప్రాంతాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఎలా ఇస్తారని పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను కౌన్సిలర్లు ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఎలా ఇచ్చారని ఆరా తీయగా రెవెన్యూ రికార్డుల్లో కౌవల్యా నదికి బదులుగా వంక కాలువగా మార్చేశారని తెలిసింది. 2015లో కైవల్యా నదికి వరదనీరు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లల్లోకి నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాళెంకోట సమీపంలోని గొడ్డేరువాగు తెగిపోయింది. అధికారులు పరిశీలించారే కానీ ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఇవేవీ పట్టించుకోని అధికారులు కైవల్యానదిని వంక కాలువగా రికార్డుల్లో నమోదు చేసి నిర్మాణాలకు అను మతులు మంజూరు చేస్తుండడం పట్ల కౌన్సిలర్లు ఆగ్రహం చేస్తున్నారు.

# వైభవంగా పోలేరమ్మ జాతర ఘటోత్సవం



ఘటుం కుండలకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల



అమ్మవారికి బలి దున్నపోతును బహూకరిస్తున్న కేవీకే ప్రసాద్ నాయుడు, రాధిక దంపతులు

వెంకటగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే గ్రామశక్తి పోలే రమ్మ జాతరలో కీలక ఘట్టమైన ఘటోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 10గంటలకు కాంపాళెంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు దంపతులు అమ్మవారి బలి దున్న పోతుకు ప్రత్యేక పూజలు నిర్వహించి పనిబాటల వారికి అప్పగించారు. మధ్యాహ్నం సమయంలో అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగులవారి వీధిలోని చాకలివారి ఆధ్వర్యంలో ఘటుం కుండలు కొలువుతీరాయి. సంప్రదాయం ప్రకారం బలిజ సామాజిక వర్గానికి చెందిన పత్తేళ్ల ఘటుం కుండలకు తొలిపూజ నిర్వహించారు. అమ్మవారి ఇష్టనైవేద్యమైన అంబలి, పొంగలిని ఘటుం కుండల ముందు ఉంచి పూజలు చేశారు. పత్తేళ్ల చేత తొలి టెంకాయ కొట్టి తెచ్చిన అంబలి, పొంగలిని ఘటుంకుండల్లో పోశారు. అనంతరం అమ్మవారి మండపం ముందు బలి దున్నపోతుకు స్నానం చేయించి పసుపు, కుంకుమలతో పూజలు చేసి పసుపుగుడ్డ కప్పారు. భక్తులు ఘటుం కుండలకు పూజలు చేసి తమవెంట తీసుకువచ్చిన అంబలి, పెరుగన్నం, పొంగలిని ఘటుంకుండల్లో వేసి మొక్కులు చెల్లించు కొన్నారు. భక్తుల పూజల అనంతరం ఘటుం కుండలను చాకలివారు నెత్తిన పెట్టుకొని ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ బలి దున్నపోతును ఊరేగింపుగా తీసుకువెళ్లి పోలేరమ్మ దేవ స్థానం వద్ద పూజలు చేశారు. తిరిగి ఘటుం కుండలు, బలి దున్న పోతును ఊరేగింపుగా తీసుకువెళ్లి అప్పటి రాజాల వంటశాల ప్రాంగణంలో వడ్లను పోసి వాటిపై కొలువుదీర్చారు. నగరి నుంచి వచ్చిన సారెలతో కుండలకు రాజాల అనుచరులు పూజలు నిర్వ హించారు. అంబలి, పెరుగన్నాన్ని ఘటుం కుండల్లో వేసి హారతి ఇచ్చారు. అక్కడ ఘటుం కుండ లను భక్తులు దర్శించుకున్నాక పట్టణంలో తాటిపర్తి వారింటికి చేరుకోవడంతో చాకలివారి కాళ్లుకడిగి ఘటుంకుండలకు పూజలు చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, జీకేపల్లి బాబు నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి తదితరులు ఘటుంకుండలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఘటోత్సవ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ్య సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - బెస్త కార్పొరేషన్, సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్లకు సత్కారం

## టీడీపీలో కష్టపడే వారికి సముచిత స్థానం: కొండేపాటి

సూళ్లూరుపేట, తడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తారనడానికి నామినేటెడ్ పదవులు దక్కించుకున్న బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్‌లే ఉదాహరణని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో బెస్త కార్పొరేషన్, ఏఎంసీ ఛైర్మన్లగా నియమితులైన బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్ అభినందన కార్యక్రమం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండేపాటి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని ముందకు తీసుకెళ్లాలన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ అధిష్టానం గుర్తింపు ఇస్తుందని, అంతేతప్ప పైరవీలకు తావుండదని చెప్పారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన భరించలేక ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదన్నారు. అబద్ధపు ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వలే జైత్రయాత్ర కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా మారిందని, త్వరలోనే పులికాట్ పూడిక తీత పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీలో గ్రూపులు లేవని, అందరూ ఒకే కుటుంబమని, కష్టపడ్డ వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఆయన వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్‌లను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ పోలిశెట్టి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఆదినారాయణరెడ్డి, టీడీపీ నాయకులు విజయబాస్కర్ రెడ్డి, బొమ్మన్ పళణి, రఫీ, మాధవ నాయుడు, శెల్వం, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. ఆదివారం ఆయన పట్టణంలో అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలి మండపం వద్ద పోలేరమ్మ కొలువుదీరే ప్రదేశంలో క్యూలైన్లు ఏర్పాట్లు, అమ్మవారి పుట్టినిల్లుగా భావించే కుమ్మరివీధిలోని కుమ్మరి మండపం వద్ద క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారిని తీసుకువచ్చే సమయంలో తొక్కిసలాట జరగకుండా రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా అమ్మవారి దేవస్థానం వద్ద దర్శన క్యూలైన్లు ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఆయన వెంట దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంగ మురళీ కృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.

## 'రైతుపోరు' పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతున్నలకు బాసటగా ఈనెల 9వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్క రించారు. ఎమ్మెల్సీ మురళీధర్, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల నిరసన

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన తెలిపారు. అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్, వెంకయ్య, ప్రవీణ్, సంపత్, ప్రశాంత్, శ్రీనివా సులు, గౌస్, నారాయణ, సందానీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



వరలక్ష్మిని సత్కరిస్తున్న మొదలియార్ సంఘ నాయకులు - కుంపటి కిషోర్‌ను సన్మానిస్తున్న చర్చి వ్యవస్థాపకురాలు వసంతకుమారి

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పెళ్లకూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన చిన్నంబేటి వరలక్ష్మి నాయుడుపేట మండలం విన్నమాల మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె గురుపూజోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం వరలక్ష్మిని మొదలియార్ సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మొదలియార్ సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూడి పళని, కరీంబాయి, చెంచు సుబ్రహ్మణ్యం మొదలియార్, సాయిబాబా మొదలియార్, పలేంలటి రమణయ్య మొదలియార్, కూన మురళీ మొదలియార్, లొడారి మురళీ మొదలి యార్, జయరాం మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట:** యాకశిరి పాటిమిట్టలో పనిచేస్తున్న కుంపటి కిషోర్ గురుపూజోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందు కున్నారు. ఆదివారం నాయుడుపేట మండలం విన్నమాలలోని జీసెస్స్ గ్రేస్ చర్చిలో కిషోర్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చర్చి వ్యవస్థాపకురాలు వసంతకుమారి, రాజరత్నం, పాస్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ విజయమేరీ, శేఖర్‌బాబు, ప్రసాద్, యేసుదాసు పాల్గొన్నారు.

## ఆలయాల మూసివేత



మూసివేసిన చెంగాళమ్మ ఆలయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు ఆలయాలను మూసివేశారు. సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 9 గంటలకు శుద్ధిపూజ సంప్రోక్షణ అనంతరం భక్తులకు పునఃదర్శన ప్రారంభిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని మద్వేంకట రామ్మూరిస్వామి ఆలయం, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, బాలాంజ నేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలను కూడా మూసివేశారు.

**గూడూరు:** పట్టణంలోని కోదండ రామాంజనేయస్వామి, అళగనాధస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం 7:30 నుంచి దర్శనం కల్పించనున్నారు.

**చిల్లకూరు:** తూర్పుకనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం, కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను మధ్యాహ్నం 3గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 7:30గంటలకు ఆయా ఆలయాల్లో దర్శనాలు ప్రారంభం కానున్నాయి.

**కోట:** గూడలిలోని సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి, శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం, గూడలితిప్పపై వెలసిన్న పర్వత వర్ధిని సమేత భీమేశ్వర ఆలయాలు మూతపడ్డాయి. అదే విధంగా కోటలోని గ్రామదేవత కోటమ్మ ఆలయం, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయాలనూ మూసివేశారు.


## వైభవంగా ఫలాభిషేకం



ఉత్సవ మూర్తులకు అభిషేకాల నిర్వహిస్తున్న అర్చకులు

చిట్టమూరు, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఫలాభిషేకం వైభవంగా జరిగింది. శతస్తంభాల కల్యాణ మండ పంలో శ్రీవల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు ఉత్సవమూర్తులకు 40 రకాల పండ్లు, తేనె, నెయ్యి, పంచదారతో ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు. నందిసేవ కార్యక్రమంలో భాగంగా రాత్రి మల్లాసుర, కొల్లాసుర, యుద్ధఘట్టాల సన్నివేశాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ ఛైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సునీల్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చెర్మన్లు వెంకటసుబ్బారెడ్డి, సాయిరెడ్డి, చెంచురాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సంద ర్భంగా ఆదివారం చెంగాళమ్మ ఆలయంలో మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగ ణంలోని యాగశాల మండ పంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వేదపండి తులు, మంత్రోచ్చారణల నడుమ యాగం చేశారు. సూళ్లూరుపేటకు చెందిన భైరి పార్థసారధిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలకు సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హామీలను అమలు చేయండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప జోన్ అధ్యక్షుడు ఎ.రాజు అన్నారు. నాయుడుపేట పట్టణంలోని శరవణ భవన్‌లో ఆదివారం జిల్లా కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా హరీష్, సెక్రటరీగా మహేష్, ట్రెజరర్‌గా సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్‌గా వివేకానంద, పబ్లిసిటీ సెక్రటరీ ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవ్‌రెడ్డిలను ఎంపిక చేశారు. సమావేశంలో చంద్రశేఖర్, సుధాకర్, రాజేష్, మనదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

వాకాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో పట్టాభిరామాలయం కేంద్రంగా నడుపుతున్న సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వెంకటరమణారెడ్డి, సరోజనమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో పేద విద్యార్థులైన ఎంబేటి ధనుష్‌కుమార్, పలుపూరి లక్ష్మి గాయత్రిలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వాకామి హేమంత్ కుమార్, తేజోవతి, హరీష్‌రెడ్డి, శివకుమార్, మస్తానయ్య, వంశీ పాల్గొన్నారు.

## బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఢీ కొట్టి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కల్లూరు గ్రామానికి చెందిన సురేంద్ర, ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ గాయపడ్డారు. ఆదివారం కల్లూరు నుంచి సూళ్లూరుపేటకు వెళుతున్న ట్రాక్టర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన సురేంద్ర, రమేష్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది సూళ్లూరు పేటకు తరలించి చికిత్స అందించారు.